హైదరాబాద్ పాలనలో కొత్త శకం



మొదటి పేజీ తరువాయి

తీసుకురానున్నారు. ప్రతి ఆస్తికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి, ఆస్తిపన్ను, నీటి బిల్లులు, మురుగునీటి ఛార్జీలు, పారిశుద్ధ్య బకాయిలను అనుసంధానించనున్నారు. 'క్యూర్-1' పేరుతో ఒకే బిల్లు అందించే విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. మున్సిపల్ సేవలు, అనుమతులు, లైసెన్సులను ఒకే పోర్టల్ ద్వారా పొందే అవకాశం కల్పించనున్నారు.ఆస్తిపన్ను విధానంలోనూ మార్పులు ప్రతిపాదించారు. వార్షిక అద్దె విలువకు బదులుగా రిజిస్ట్రేషన్ శాఖ గైడ్‌లైన్ విలువ ఆధారంగా పన్ను లెక్కించనున్నారు. 375 చదరపు అడుగుల వరకు ఉన్న ఆస్తులకు రూ.101 నామమాత్రపు పన్ను కొనసాగనుంది. కొత్త రేట్లు ఖరారయ్యే వరకు నివాస ఆస్తులకు 0.15 శాతం, నివాసేతర ఆస్తులకు 0.75 శాతం రేట్లు వర్తించనున్నట్లు వివరించారు. పన్ను ఒక్కసారిగా పెరగకుండా గత ఏడాదితో పోలిస్తే వార్షిక పెరుగుదలపై 10 శాతం పరిమితి విధించారు. భవన నిర్మాణ అనుమతులను ఆన్‌లైన్ ద్వారా అందించడంతో పాటు నిర్ణీత సమయంలో నిర్ణయం తీసుకోకపోతే దరఖాస్తును పైస్థాయికి పంపే విధానం తీసుకొస్తున్నారు. కొన్ని సందర్భాల్లో డీమ్డ్ అప్రూవల్‌కు కూడా అవకాశం కల్పించనున్నారు. చిన్న ఉల్లంఘనలకు క్రిమినల్ కేసులకు బదులుగా సివిల్ జరిమానాలు విధించే విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. వ్యాపార కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు నైట్ ఎకానమీ జోన్ల ఏర్పాటుకూ అవకాశం కల్పించనున్నారు. రోడ్ల తవ్వకాల్లో శాఖల మధ్య సమన్వయం కోసం యుటిలిటీ కోఆర్డినేషన్ కమిటీ పనిచేయనుంది. ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత కోసం ప్రత్యేక అథారిటీని ఏర్పాటు చేయనున్నారు. ఫుట్‌పాత్‌లు, పాదచారుల క్రాసింగ్‌లు, వీధి దీపాలు, ట్రాఫిక్ సిగ్నళ్లు, పాఠశాలల వద్ద సురక్షిత ప్రాంతాల ఏర్పాటుపై దృష్టి సారించనున్నారు. చెరువులు, నాలాలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆక్రమణలు, నిర్మాణ వ్యర్థాల అక్రమ పారవేతపై చర్యలు తీసుకునేలా నిబంధనలు రూపొందించారు. నిర్దేశిత భవనాల్లో వర్షపు నీటి సంరక్షణ చర్యలు తప్పనిసరి చేయడంతో పాటు పర్యావరణహిత చర్యలు చేపట్టే ఆస్తులకు పన్ను రాయితీలు ఇచ్చే అవకాశాన్ని కల్పించారు. విపత్తుల నిర్వహణ కోసం కోర్ అర్బన్ రీజియన్‌కు సమగ్ర ప్రణాళిక రూపొందించనున్నారు. అగ్నిప్రమాదాల నివారణకు నిర్దేశిత భవనాల్లో ఫైర్ ఆడిట్లు, భద్రతా తనిఖీలు చేపట్టనున్నారు. మహిళలు, దివ్యాంగులు, వృద్ధులు, చిన్నారులు, ట్రాన్స్‌జెండర్ల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు గిగ్ కార్మికులకు విశ్రాంతి కేంద్రాలు, పారిశుద్ధ్య సదుపాయాలు, పార్కింగ్, ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని కూడా కొత్త చట్టం కల్పిస్తోంది. దశాబ్దాల క్రితం రూపొందించిన పాత మున్సిపల్ చట్టంలోని కాలం చెల్లిన నిబంధనలను తొలగిస్తూ, ఆధునిక నగర అవసరాలకు అనుగుణంగా పాలనా వ్యవస్థను తీర్చిదిద్దడమే కొత్త చట్టం లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంటోంది.

రాష్ట్రంలో కరువు ఛాయలు..

వెంటనే కరువు మండలాలు ప్రకటించాలి

రైతులకు 24 గంటల విద్యుత్ ఇవ్వాలి.. సీఎంకు కవిత సవాల్

దశ, హైదరాబాద్: తెలంగాణలో కరువు పరిస్థితులు నెలకొన్నాయని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో తక్షణమే కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో భూగర్భ జలాలు 20 అడుగుల మేర పడిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతులకు ఆరు గంటలకు మించి విద్యుత్ సరఫరా కావడం లేదని కవిత ఆరోపించారు.విద్యుత్ కోతలను నిరూపించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి రావడానికి తాను సిద్ధంగా ఉన్నానని సవాల్ చేశారు. ప్రభుత్వం ఏం చేసైనా రైతులకు నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీరు సమృద్ధిగా ఉన్నప్పటికీ రాష్ట్రంలోని ప్రాజెక్టులను నీటితో నింపడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి వరుణ యాగం చేసినా వర్షాలు కురవకపోవడంతో ఇక చేతులెత్తేశారని ఆమె విమర్శించారు.రైతుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ట్యాంకర్‌తో వరి పొలానికి నీళ్లు..

కాంగ్రెస్ కార్యకర్త వీడియో వైరల్

నీటి కొరత, విద్యుత్ సమస్యలతో ప్రత్యామ్నాయ మార్గం



దశ, నల్లగొండ: నల్లగొండకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త రజక వెంకట్ తన వరి పొలాన్ని కాపాడుకునేందుకు ట్యాంకర్‌తో నీళ్లు పెట్టుకుంటున్న వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.వర్షాలులేకపోవడంతో పాటు వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో పంట ఎండిపోకుండా ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్నట్లు వీడియోలో పేర్కొన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పంటను కాపాడుకునేందుకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఈ ఘటన అద్దం పడుతోందంటూ పలువురు స్పందిస్తున్నారు. వ్యవసాయానికి నీరు, విద్యుత్ అందుబాటుపై చర్చకు దారితీస్తోంది.

బిస్కెట్ గొంతులో ఇరుక్కొని చిన్నారి మృతి

ఏడాది వయసున్న బాలుడి మృతితో విషాదం

దశ, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. బిస్కెట్ తింటుండగా గొంతులో ఇరుక్కొని ఏడాది వయసున్న బాలుడు మృతి చెందాడు. మూసాపేట మండలం సుర్తి తండాకు చెందిన మూడవత్ శ్రీను, మౌనిక దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం రాత్రి పిల్లలు ఇంటి ముందు ఆడుకుంటుండగా తల్లి వారికి బిస్కెట్లు ఇచ్చి వంట చేసేందుకు లోపలికి వెళ్లింది. ఈ క్రమంలో ఏడాది వయసున్న బాలుడు బిస్కెట్ తింటుండగా అది గొంతులో ఇరుక్కుంది. శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిపడిన చిన్నారి కుప్పకూలిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆటోలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చిన్నారి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఏడాది వయసులోనే కుమారుడిని కోల్పోవడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

టర్మ్ ఇన్సూరెన్స్ ప్రీమియం వెనక్కి.. లాభమేనా?

కుటుంబానికి ఆర్థిక భరోసాను కల్పించడంలో టర్మ్ ఇన్సూరెన్స్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. సాధారణ టర్మ్ పాలసీలో పాలసీ కాలపరిమితి ముగిసే వరకూ జీవించి ఉంటే,ఎలాంటిసొమ్మూ రాదు.దీంతో చాలామంది ఇప్పటికీ, ఈ పాలసీని తీసుకునేందుకు ఇబ్బంది పడుతుంటారు. దీన్ని గమనించిన బీమా సంస్థలు రిటర్న్ ఆఫ్ ప్రీమియం పేరుతో ప్రత్యేక ప్లాన్లను అందించడం ప్రారంభించాయి. పాలసీ కాలపరిమితి పూర్తయ్యే వరకూ పాలసీదారు జీవించి ఉంటే, చెల్లించిన మొత్తం ప్రీమియాన్ని తిరిగి ఇస్తామని చెబుతున్నాయి. పాలసీ కాలపరిమితిలో మరణం సంభవిస్తే, నామినీకి బీమా మొత్తం లభిస్తుంది. చెల్లించిన సొమ్ము తిరిగి వస్తుందనే ఆలోచనతో చాలామంది ఈ ప్లాన్ల వైపు మొగ్గు చూపుతారు. కానీ, వీటిలో ఉండే వాస్తవ ఖర్చు, ఇతర అంశాలను పరిశీలించడం అవసరం.

ప్రీమియం భారం..

ఈ పాలసీల్లో ప్రధానంగా గమనించాల్సింది ప్రీమియం ధర.ఒకే బీమా మొత్తం,కాల పరిమితి కలిగిన సాధారణ టర్మ్ పాలసీతో పోలిస్తే, వీటి ప్రీమియం రెండు నుంచి మూడు రెట్లు ఎక్కువగా ఉంటుంది. పెరిగిన ప్రీమియం భారం వల్ల చాలామంది తమ కుటుంబ అవసరాలకు సరిపడా రక్షణకాకుండా తక్కువ బీమా మొత్తాన్ని ఎంచుకుంటారు. ఇది అనూహ్య పరిస్థితులు ఎదురైనప్పుడు కుటుంబానికి లభించాల్సిన రక్షణను తగ్గిస్తుంది. అంతేకాకుండా ఈ పాలసీల్లో లభించే సగటు రాబడి కేవలం 4.5 శాతం నుంచి 5.5శాతం మధ్య మాత్రమే ఉంటుంది. 20 నుంచి 30 ఏళ్ల సుదీర్ఘ కాలంలో ద్రవ్యోల్బణం ప్రభావం వల్ల తిరిగి వచ్చే సొమ్ము కొనుగోలు శక్తి ఇప్పటి విలువతో పోలిస్తే గణనీయంగా తగ్గిపోతుంది.

రద్దు చేసుకుంటే...

వ్యక్తిగత కారణాల వల్ల పాలసీని మధ్యలోనే రద్దు చేసుకుంటే నష్టం వాటిల్లే అవకాశం ఉంది. 2024 అక్టోబరు 1 నుంచి అమల్లోకి వచ్చిన నిబంధనల ప్రకారం ఏడాది కాలపరిమితి పూర్తయి, పూర్తి ప్రీమియం చెల్లిస్తే, ప్రత్యేక స్వాధీన విలువ లభిస్తుంది. గ్యారెంటీ సరెండర్, స్పెషల్ సరెండర్.. ఈ రెండింటిలో విలువ ఎక్కువగా ఉన్న మొత్తాన్ని కంపెనీ చెల్లించాల్సి ఉంటుంది. సాధారణంగా మూడేళ్ల తర్వాత పాలసీ రద్దు చేసుకుంటే, చెల్లించిన ప్రీమియంలో కేవలం 30 నుంచి 35 శాతమే వెనక్కి వస్తుంది. అయిదేళ్లకు 50 నుంచి 65 శాతం, పదేళ్లు దాటితేనే 80 90 శాతం వరకూ లభిస్తుంది. ముందస్తు స్వాధీనం వల్ల అసలు ప్రీమియంపై ఎలాంటి రాబడి రాకపోగా, చెల్లించిన సొమ్ములో కొంత కోల్పోవాల్సి వస్తుంది.

సోలార్ ఫెన్సింగ్‌తో పంటపొలాలకు రక్షణ..

యాదాద్రి రైతులకు వరంగా మారిన సౌర కంచెలు



దశ, నల్గొండ: కోతులు, అడవి పందుల బెడదతో తీవ్రంగా నష్టపోతున్న రైతులకు సోలార్ ఫెన్సింగ్ వరంగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 30 మంది రైతులు తమ పొలాల చుట్టూ ఏర్పాటు చేసుకున్న సౌర విద్యుత్ కంచెలతో పంటలను విజయవంతంగా రక్షించుకుంటూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. నాబార్డ్ (NABARD), స్థానిక స్వచ్ఛంద సంస్థల ఆర్థిక, సాంకేతిక సహకారంతో ఈ ప్రాజెక్టు అమలవుతోంది. తుర్కపల్లి, భువనగిరి మండలాల్లో వన్యప్రాణుల దాడులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో 'పిలుపు' స్వచ్ఛంద సంస్థ ఈ సమస్యను నాబార్డ్ దృష్టికి తీసుకెళ్లింది. దీంతో తొలిదశలో నలుగురు రైతులతో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఒక ఎకరం భూమికి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి సుమారు రూ.30 వేల వ్యయం కాగా, అందులో రూ.19 వేల గ్రాంట్‌ను నాబార్డ్ అందించింది. మిగిలిన మొత్తాన్ని రైతులు భరించారు. సోలార్ ప్యానెల్లు, బ్యాటరీలు, ప్రత్యేక తీగలతో పాటు వాటి నిర్వహణపై కూడా రైతులకు శిక్షణ ఇచ్చారు. ప్రయోగం విజయవంతం కావడంతో ఆర్డీఎస్ఎస్, ఏఐడీ వంటి స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావడంతో మరో 26 మంది రైతులు ఈ సౌర కంచెలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మొత్తం లబ్ధిదారుల సంఖ్య 30కి చేరింది. గత యాసంగి సీజన్‌లో ఈ రైతులు మొక్కజొన్న, కూరగాయల పంటలను వన్యప్రాణుల భయం లేకుండా సాగు చేసి ఆశించిన దిగుబడులు పొందారు.

రవ్లగడ్డ తండాకు చెందిన మహిళా రైతు గుగులోతు శోభ మాట్లాడుతూ, గతంలో అడవి పందులు, కోతుల వల్ల పంటలు పూర్తిగా నాశనమయ్యేవని, ఇప్పుడు సోలార్ ఫెన్సింగ్ కారణంగా పంట ఒక్క గింజ కూడా వృథా కాకుండా చేతికందుతోందని తెలిపారు. ఈ విధానాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల రైతులు కూడా వస్తున్నారని చెప్పారు.

తెలంగాణలో కోతులు, అడవి పందుల కారణంగా ప్రతి ఏడాది లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయి. మొక్కజొన్న, శనగ, వేరుసెనగ, చెరకు, జొన్న, సోయాబీన్, కూరగాయలు, ల తోటలు ఎక్కువగా నష్టపోతున్నాయి. పంటలను కాపాడే క్రమంలో రైతులపై వన్యప్రాణులు దాడి చేయడంతో గత పదేళ్లలో 40 మందికి పైగా రైతులు ప్రాణాలు కోల్పోయినట్లు అంచనాలు ఉన్నాయి. సోలార్ ఫెన్సింగ్‌లో తక్కువ తీవ్రత గల విద్యుత్ షాక్, అలారం వ్యవస్థ ఉండటంతో జంతువులు పొలాల్లోకి ప్రవేశించకుండా వెనుదిరుగుతాయి.

ఈ విధానంలో వన్యప్రాణులకు ఎలాంటి ప్రాణహాని ఉండదు. దీంతో రైతులు రాత్రింబవళ్లు పొలాలకు కాపలా కాయాల్సిన అవసరం లేకుండా ప్రశాంతంగా వ్యవసాయం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ విధానం విజయవంతమవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సోలార్ ఫెన్సింగ్ పాలసీ తీసుకువచ్చి రైతులకు సబ్సిడీతో ఈ సౌకర్యాన్ని విస్తరించాలని రైతులు కోరుతున్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం

మొదటి పేజీ తరువాయి

పనులు చేపట్టనున్నారు. క్రీడాకారుల వసతి, భోజనం, రవాణా, ప్రేక్షకుల సౌకర్యాల కల్పనపై అధికారులు దృష్టి సారించారు.క్రీడల నిర్వహణ కోసం ఐదు రాష్ట్రస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఆర్గనైజింగ్ కమిటీకి సీఎం రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ కోచైర్మన్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం. డిసెంబర్ 11న గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభోత్సవం, డిసెంబర్ 22న ఎల్బీ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్‌లో ముగింపు కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, ఫుట్‌బాల్, హాకీ, షూటింగ్, స్విమ్మింగ్, వెయిట్‌లిఫ్టింగ్, రెజ్లింగ్‌తో పాటు కబడ్డీ, ఖోఖో వంటి క్రీడల్లో యువ క్రీడాకారులు పోటీపడనున్నారు. ఈ పోటీల నిర్వహణతో తెలంగాణలో క్రీడా మౌలిక సదుపాయాలు మెరుగుపడటంతో పాటు యువ ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించే అవకాశం ఉంది.

పంజాగుట్ట-జూబ్లీహిల్స్ మధ్య భారీ ఫ్లైఓవర్

మొదటి పేజీ తరువాయి

నుంచి బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36 మీదుగా చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ వరకు నిర్మించనున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 వైపు నుంచి వచ్చే వాహనాల కోసం జలగం వెంగళరావు పార్కు వరకు ప్రత్యేక ర్యాంపు నిర్మించే ప్రతిపాదన కూడా ఉంది. ఈ ప్రాజెక్టును మేఘా సంస్థకు అప్పగించినట్లు సమాచారం. అంచనా వ్యయం, నిర్మాణ గడువుపై స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు, కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రతిపాదనలపై జీహెచ్ఎంసీ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. తొలుత రూ.1,090 కోట్లతో చేపట్టాలని భావించిన ఈ ప్రాజెక్టుల స్థానంలో వన్‌వే ట్రాఫిక్ విధానం ద్వారా రద్దీని తగ్గించడంపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో మేఘా, కేఎన్ఆర్ సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసినట్లు సమాచారం.

మైనారిటీలకు రూ.4 వేల కోట్ల బడ్జెట్ హామీ ఏమైంది?

మొదటి పేజీ తరువాయి

చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు దాటినా హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. గజ్వేల్‌లో రైతులకు నాణ్యమైన విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నాయని, ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్‌లో రోడ్లు, డ్రైనేజీ, ఆస్పత్రులు, విద్యాసంస్థలు అభివృద్ధి చెందాయని పేర్కొన్న హరీశ్‌రావు..కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి మందగించిందని విమర్శించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

అవును.. విమానాన్ని కూల్చేయాలనుకున్నా

నేరాన్ని అంగీకరించిన కోపైలట్

ఫ్లైదుబాయ్ (Flydubai) విమానాన్ని హైజాక్ చేయడానికి యత్నించాడని అనుమానిస్తున్న కో పైలట్ హమామ్ అల్‌హమ్మామీ (Hamam alHammami) తన నేరాన్ని అంగీకరించాడు. విమానాన్ని కూల్చివేయాలని అనుకున్నానని.. పథకం ప్రకారమే కెప్టెన్ స్మిత్ మచ్చర్ దృష్టి మళ్లించి, దాడి చేశానని విచారణలో పేర్కొన్నాడు. తనకు మరణమంటే భయం లేదంటూ వ్యాఖ్యానించాడు. అయితే ఈ కుట్ర వెనుక ఎవరున్నారనే విషయం మాత్రం వెల్లడించలేదు.

కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం

మొదటి పేజీ తరువాయి

రంగంలో సాంకేతికత వినియోగం, భవిష్యత్ వైద్య విధానాలు, ఆవిష్కరణలపై చర్చించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ హెల్త్, పర్సనలైజ్డ్ మెడిసిన్, మెడికల్ టూరిజం తదితర అంశాలపై అంతర్జాతీయ నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. కేటీఆర్ కూడా ఆరోగ్య రంగంలో సాంకేతికత వినియోగం, డిజిటల్ హెల్త్, ఆవిష్కరణలపై తన ఆలోచనలను అంతర్జాతీయ వేదికపై పంచుకోనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com